# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 08-04-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చేలా రహదారుల నిర్మాణం జరగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు.
- "పీఎం కుసుమ్" పథకం కింద రైతులకు పగటిపూట ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.
- రాష్ట్రంలోని ప్రతి నగరం, పట్టణం, గ్రామాలలో క్రీడల నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.
- భవన నిర్మాణాలలో భద్రతా ప్రమాణాలు, నిబంధనలు కచ్చితంగా పాటించాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు.

======================

ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చేలా రాష్ట్రంలో జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణం జరగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. జాతీయ రహదారులు రాష్ట్రంలోని పోర్టులతో పాటు.. దేశంలోని వివిధ ప్రాంతాలను అనుసంధానించేలా నిర్మాణం చేపట్టాలని సూచించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రహదారులు, భవనాలు, రవాణా, జాతీయ రహదారి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ఈ రోజు సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలో మొత్తం 45,433 కిలోమీటర్ల మేర రహదారులు ఉంటే వాటిలో ఏటా 10,238 కిలోమీటర్ల మేర నిరంతర నిర్వహణ చేయాల్సి ఉందన్నారు. గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. పోర్టుల విషయంలో ఆంధ్రప్రదేశ్ కీలకంగా ఉందని లాజిస్టిక్స్ రంగాన్ని రాష్ట్రంలో అభివృద్ధి చేసేలా పూర్తి స్థాయిలో దృష్టి పెంచాలన్నారు. అతి తక్కువ వ్యయంతో ప్రజా రవాణా కోసం విద్యుత్ బస్సుల వినియోగం అవసరమని చంద్రబాబు నాయుడు అన్నారు.

======================

ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. విజయవాడలోని గుణదల విద్యుత్ సౌధలో ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ నూతన కార్యాలయానికి స్థానిక లోక్ సభ సభ్యులు కేశినేని శివనాథ్ తో కలసి మంత్రి ఈరోజు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం వేగంగా జరుగుతోందన్నారు. పీఎం కుసుమ్ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు పగటిపూట ఉచిత విద్యుత్ అందించడం కోసం చేపట్టిన టెండర్లు పూర్తయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 21 సెకన్లు)

======================

మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రైతులకు సూచించారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలం మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో నిర్వహించిన "కిసాన్ మేళా" కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఏ ప్రాంతంలో.. ఏ పంటలు.. అనుకూలమో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు గ్రామ స్థాయిలోనే రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సాగులో రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవడంతో పాటు ఆరోగ్యాన్ని కూడా పరిరక్షించుకోవచ్చునని తెలిపారు. కాలువల ఆధునీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

======================

క్రీడా రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు. రాబోయే మూడు సంవత్సరాలలో ప్రతి నగరం, పట్టణం, గ్రామాల్లో క్రీడలకు విశేష ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం అభివృద్ధి పనులకు ఖేలో ఇండియా నిధులతో శంకుస్థాపన కార్యక్రమాన్ని ఆయన ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... స్టేడియం అభివృద్ధికి మూడు దశలలో మొత్తం సుమారు 160 కోట్ల నుండి 170 కోట్ల రూపాయల మేర ఖర్చు చేస్తామని తెలిపారు. ఇందులో ఖేలో ఇండియా ద్వారా 20 కోట్లు, శాప్ ద్వారా 20 కోట్ల రూపాయలు, మిగిలిన నిధులు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సమకూరనున్నాయని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

======================

వైద్య ఆరోగ్య శాఖలో రిక్రూట్మెంట్ బోర్డు ద్వారానే జోనల్ల పోస్టుల భర్తీ చేస్తామని ఆ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈరోజు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ నియామకాలు మరింత త్వరగా, పాదరదర్శకంగా జరిగేందుకు వీలుగా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోని నాలుగు జోనల్ల కార్యాలయాలపై ఒత్తిడి తగ్గించే ఉద్దేశంతో జోనల్ల స్థాయి పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. నోటిఫికేషన్ జారీ నుంచి ఎంపిక జాబితా ఖరారు వరకు మొత్తం ప్రక్రియ ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూటుమెంటు బోర్డు ద్వారా జరుగుతుందని మంత్రి వెల్లడించారు. ఇకపై ఇచ్చే నోటిఫికేషన్ల జారీకి ఈ నిర్ణయం అమల్లోనికి వస్తుందని స్పష్టం చేశారు.

విరామం

======================

రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పర్యాటక, సృజనాత్మక, ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ముంబైలో జరుగుతున్న 21వ హోటల్ ఇన్వెస్ట్ మెంట్ కాన్ఫరెన్స్ సౌత్ ఏషియా (HICSA) కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా

మాట్లాడుతూ... అమరావతిని అంతర్జాతీయ స్థాయి "క్రియేటివ్ ఎకానమీ హబ్"గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని అమరావతి, విశాఖపట్నం, తిరుపతి ప్రాంతాలను కలుపుతూ.. స్టోరీటెల్లింగ్ కారిడార్ ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఆధ్యాత్మికతతను, సంస్కృతిని డిజిటల్ మాధ్యమాల్లో అంతర్జాతీయ పర్యాటకులకు పరిచయం చేయడానికి, భవిష్యత్ తరాలకు అందించేందుకు హోలోగ్రాఫిక్ స్టోరీటెల్లింగ్, ఇమ్మర్సివ్ కల్చరల్ నెరేటివ్స్ వంటి అధునాతన సాంకేతికతలను ఉపయోగిస్తామని మంత్రి వెల్లడించారు.

======================

భవన నిర్మాణాలలో భద్రతా ప్రమాణాలు, నిబంధనలు కచ్చితంగా పాటించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమ చర్యలు తప్పనిసరిగా అమలు చేయాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విశాఖ జిల్లాలో జరుగుతున్న భవన నిర్మాణ పనులపై మంత్రి ఈరోజు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ తనిఖీల్లో అనేక ప్రదేశాల్లో కార్మికులకు కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేవని గుర్తించినట్లు చెప్పారు. భద్రతా పరికరాల వినియోగం తప్పనిసరి చేయాలని కార్మిక శాఖ అధికారులను, యజమానులను ఆదేశించినట్లు వివరించారు. సెస్ చెల్లింపుల విషయంలో కూడా భారీ ఉల్లంఘనలు ఉన్నాయని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 24 సెకన్లు)

======================

విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న `మెగా కల్చరల్ ఫెస్ట్`లో పాల్గొనేందుకు ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ కొద్ది సేపటి క్రితం నగరానికి చేరుకున్నారు. ఆయనకు విశాఖ విమానాశ్రయంలో కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల నుంచి వినతులు స్వీకరించి.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి బయల్దేరి వెళ్లారు.

======================

బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొని రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను ఆయన అందిస్తారు. రేపు ఉదయం 10 గంటల 50 నిమిషాలకు భట్టిప్రోలు మండలం సూరేపల్లికి చేరుకుంటారు. అనంతరం 11 గంటలకు అక్కడ నిర్వహించే ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటా 35 నిమిషాలకు వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడతారు.

======================

ఛత్తీస్‌గఢ్ పై ఉన్న ఉపరితల ఆవర్తనం నుండి తెలంగాణ, రాయలసీమ, అంతర తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో ఉత్తర-దక్షిణ ద్రోణి ఏర్పడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా జిల్లాలలో ఈరోజు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి, రెండు చోట్ల చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారిణి జి. లక్ష్మి తెలిపారు. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని వెల్లడించారు.

======================
======================